ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌలభ్యం కల్పించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిం ది. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, పీయూ కళాశాలలకు ఉచిత విద్యుత్, నీటి సౌలభ్యాలు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయించింది. 46,829 పాఠశాలలు, 1234 పీయూ కళాశాలలకు విద్యుత్ అనుకూలం కానుంది. ఇందుకు రూ. 25 కోట్లు ఖర్చు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతిపై
రంగంలోకి సిట్

- మాజీ ఎండీ, అకౌంటెంట్ అరెస్టు
- హైదరాబాద్ ఆర్‌బీఎల్ బ్యాంకుకు నిధుల మళ్లింపు
- సీబీఐ దర్యాప్తునకు యూనియన్ బ్యాంక్ డిమాండ్
- నేడు మంత్రి నాగేంద్ర రాజీనామాపై నిర్ణయం

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవినీతిపై సిట్ రంగంలోకి దిగింది. ప్రభుత్వం శుక్రవారం సిట్‌ను ఏర్పాటు చేయగా శనివారం ఇద్దరు ముఖ్యులను అరెస్టు చేసింది. కార్పొరేషన్‌కు సంబంధించి బెంగళూరు బ్యాంకు ఖాతాల నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆర్‌బీఎల్ బ్యాంకు ఖాతాలకు నిధులు మళ్లింపుపై మాజీ ఎండీ జేజీ పద్మనాభ, అకౌంటెంట్ పరశురామ్ జీ. దురుగణ్ణనవర్‌ను శనివారం ఉదయం సీఐడీ అదనపు డీజీపీ మనీశ్ కర్బేకర్ నేతృత్వంలో అరెస్టు చేశారు. కార్పొరేషన్ అకౌంటెంట్ చంద్రశేఖర్ సూసైడ్ నోట్‌లో యూనియన్‌బ్యాంకులో ఉండే గ్రాంట్లను ఇద్దరు అధికారులు ఒత్తిడి తెచ్చి బదిలీ చేశారని పేర్కొన్న విషయం తెలిసిందే. చంద్రశేఖర్ ఆత్మహత్య, కార్పొరేషన్ నిధుల అక్రమ బదిలీతోపాటు ఆర్థిక వ్యవహారాలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. హైదరాబాద్‌లోని ఆర్‌బీఎల్ బ్యాంకులో ఖాతాలకు మార్చి 5 నుంచి 30 తేదీల మధ్య నగదు బదిలీ చేశారు. మార్చి 5న ఫిఫ్మస్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాకు రూ.5.35 కోట్లు, అదే రోజున జులియెంట్ ట్రైనింగ్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్‌కు రూ.4.97 కోట్లు, 6న హ్యాపియెస్ట్ మైండ్ టెక్నాలజీస్‌కు రూ.4.53 కోట్లు, వైఎం ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.4.98 కోట్లు, మన్ను ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.5.01 కోట్లు, అకార్డ్ బిజినెస్ సర్వీసెస్‌కు రూ.5.46 కోట్లు, షై టాలెంగ్ సాఫ్ట్‌వేర్ ఇండియా లిమిటెడ్‌కు రూ.5.10 కోట్లు, మార్చి11న నిత్యసెక్యూరిటీ సర్వీసెస్‌కు రూ.4.77 కోట్లు, ఓల్టా టెక్నాలజీస్ సర్వీసెస్‌కు రూ.5.12 కోట్లు, మార్చి 23న బీ6 సొల్యూషన్స్‌కు రూ.4.50 కోట్లు, మార్చి 30న ఏకంగా 8 వ్యక్తిగత ఖాతాలకు రూ.40.10 కోట్లు నగదు బదిలీ చేశారు. కార్పొరేషన్‌కు చెందిన గ్రాంట్లను వ్యక్తిగత, కొన్ని కంపెనీల ఖాతాలకు కోట్లాది రూపాయలు బదిలీ చేయడంతో సీబీఐకు కేసు అప్పగించే అవకాశం ఉంది. యూనియన్ బ్యాంకు ఎంజీ రోడ్డుశాఖ నుంచి హైదరాబాద్‌లోని 10ప్రైవేట్ కంపెనీలు, 8 వ్యక్తిగత ఖాతాలకు రూ. 89.62 కోట్లు నగదు బదిలీ అయ్యింది. ట్రైనింగ్ సెంటర్లు, హెచ్‌ఆర్ ఏజెన్సీలకు ఇంతస్థాయిలో నగదు బదిలీ వెనుక కేవలం ఉద్యోగులు మాత్రమే ఉండరని, ప్రముఖుల హస్తం ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సీబీఐ దర్యాప్తునకు యూనియన్‌బ్యాంకు డిమాండ్

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు బహిరంగం కావాలంటే సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని యూనియన్‌బ్యాంకు సీబీఐకి లేఖ రాసినట్టు సమాచారం. బ్యాంకుకు సంబంధించిన నగదు ప్రైవేట్, వ్యక్తిగత ఖాతాలకు బదిలీ కావడం వెనుక ఒత్తిడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్టీ కార్పొరేషన్‌శాఖ మంత్రి నాగేంద్రను తప్పించేందుకే సిట్‌ను ఏర్పాటు చేశారని ప్రతిపక్షనేత ఆర్.అశోక్ ఆరోపించారు. సిట్ ఏర్పాటుకు ముందు ముఖ్యమంత్రి సిద్దరామయ్య వరుస సమావేశాలు నిర్వహించారు. మంత్రులు పరమేశ్వర్, మహదేవప్ప, రాజణ్ణ, దినేశ్‌గుండూరావుతో రహస్యంగా చర్చలు జరిపారు. మరోవైపు సిట్ దర్యాప్తు చేస్తుండగా రెండు సంస్థలు ఒకేసారి దర్యాప్తు చేయవని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. సీబీఐ రంగంలోకి దిగితే కేవలం ఇద్దరు అధికారులే కాకుండా పలువురు కీలక ప్రజాప్రతినిధులతోపాటు ఢిల్లీకి చెందిన కొందరిపేర్లు బహిర్గతమయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

ఎవరినీ రక్షించేది లేదు : సీఎం



వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవినీతి విషయంలో ఎవరినీ రక్షించే ప్రశ్నే లేదని, దర్యాప్తులో ఎవరు తప్పు చేసినట్టు నిర్ధారణ అయినా కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిని విచారించేందుకు ప్రత్యేకంగా సిట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వారు సమగ్రంగా విచారణ జరుపుతారన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని బీజేపీ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. మరోవైపు బీజేపీ అధికారిక 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంతో సంబంధం కల్గినవారు రూ.187 కోట్లు అవినీతికి పాల్పడి.. యూనియన్‌బ్యాంకును ఇరికించేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. మంత్రి నాగేంద్రచేత రాజీనామా చేయించాలని బీజేపీ డిమాండ్ చేసింది.

మంత్రి నాగేంద్ర రాజీనామాపై నేడు నిర్ణయం



వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతిలో మంత్రి నాగేంద్ర పేరు ప్రధానంగా వినిపిస్తుండగా ఆయనచేత రాజీనామా చేయించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్టు తెలుస్తోంది. రెండురోజుల కిందటే ఢిల్లీ నుంచే మంత్రికి రాజీనామా చేయాలని సూచించినట్టు తెలుస్తోంది. మంత్రి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. విధానపరిషత్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కాంగ్రెస్ లెజిస్లేచర్ భేటీ జరగనుంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా పాల్గొననున్నారు. ఇదే సందర్భంలోనే మంత్రి రాజీనామా అంశం ఖరారు కానున్నట్టు సమాచారం.



- ఎగ్జిట్ సర్వేలన్నీ కమలదళానికే అనుకూలం
- బీజేపీలో ఉత్సాహం
- ఎగ్జిట్‌పోల్స్‌పై నమ్మకం లేదు: డీసీఎం

ఎన్డీయే వైపే మొగ్గు

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటర్లు మరోసారి మోదీ వైపే చూసినట్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే శనివారం సాయంత్రం ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించారు. దాదాపు అన్ని సర్వేలు ఎన్డీయే వైపు చూపాయి. గడిచిన నాలుగు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి తిరుగులేని స్థానాలు సాధ్యమవుతున్నాయి. అదే మరోసారి రుజువు కానుందని సర్వేలు సూచిస్తున్నాయి. దక్షిణాదిన కర్ణాటకపైనే కాంగ్రెస్, బీజేపీ ఆశలు పెట్టుకున్నాయి. కానీ కన్నడిగులు మరోసారి ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలిచినట్టు అన్ని సర్వేలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా 2019 ఎన్నికల్లో బీజేపీకి 25, జేడీఎస్, కాంగ్రెస్ ఒక్కో స్థానాన్ని దక్కించుకోగా మండ్య నుంచి ఇండిపెండెంట్ గెలుపొందారు. మండ్య నుంచి గెలుపొందిన సుమలత ప్రస్తుతం బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. దీన్నిబట్టి రాష్ట్రం నుంచి బీజేపీకి 26మంది ఎంపీల మద్దతు ఉన్నట్టయ్యింది. ఏడాది కిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లో 224 స్థానాలకుగాను అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ 135 స్థానాలు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏడాదిలోగానే జరిగిన లోక్‌సభ బరిలోనూ అటువంటి ఫలితాలు దక్కుతాయని కాంగ్రెస్ నేతలు భావించారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కడా అటువంటి సంకేతాలు కనిపించలేదు.

సర్వే సంస్థ	బీజేపీ	జేడీఎస్	కాంగ్రెస్
టీవీ9	18	2	8
న్యూస్ 18	21-25	-	3-7
సీఎన్‌ఎక్స్	19-25	-	4-8
యాక్సిస్‌మై ఇండియా	23-25	-	3-5
ఇండియా టీవీ	18-22	1-3	4-8
ఇండియాటుడే	20-22	2-3	3-5
పోల్‌హబ్	21-25	1-2	3-7
సీ ఓటర్	23	2	3-5
జన్‌కీబాతత్	19-20	2-3	5-7
డైనమిక్	20	-	8
ఏటీపీ	22-25	-	3-5
ఇండియా టీవీ	18-22	1-3	4-8
టైమ్స్ నౌ	23	-	5

ఎగ్జిట్‌పోల్స్‌పై నమ్మకం లేదు : డీకే శివకుమార్



లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్‌పై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. ఎగ్జిట్‌పోల్స్‌పై నమ్మకం లేదని కొట్టిపారేశారు. దాదాపు అన్ని సర్వేలు కాంగ్రెస్‌కు 8 స్థానాలకు మించి గెలుపు లేదని సూచించాయి. బీజేపీకి 20 స్థానాల దాకా అవకాశం ఉందని దాదాపు అన్ని సర్వేల్లోనూ తేల్చాయి. తాము 20 స్థానాల్లో గెలుస్తామని డీకే ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకపైనే ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఎగ్జిట్‌పోల్స్ షాక్ ఇచ్చాయి. ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి 20 స్థానాల్లో గెలుపు మాదేనని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు.

కమలదళంలో ఉత్సాహం

ఎగ్జిట్‌పోల్స్‌లో తిరుగులేదని సంకేతాలు రావడంతో రాష్ట్ర కమలదళంలో ఉత్సాహం నెలకొంది. బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప ఎగ్జిట్‌పోల్స్‌పై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కుమారుడు విజయేంద్రతో చర్చలు జరిపారు. ఎగ్జిట్‌పోల్స్ అన్నీ బీజేపీవైపే ఉండడంతో ఆ పార్టీ వర్గాల్లో ఉత్సాహం రేకెత్తించినట్టయ్యింది. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి స్పందిస్తూ ఫలితాలు కూడా ఎగ్జిట్‌పోల్స్ తరహాలోనే ఉంటాయని హర్షం వ్యక్తం చేశారు



హుబ్బళ్లిలో ప్రచారంలో బీజేపీ నాయకులు (ఫైల్)

కేసెట్ ఫలితాలు విడుదల

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పరీక్షా ప్రాధికార (కేఈఏ) 2024 విద్యాసంవత్సరంలో వృత్తివిద్యా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించిన కర్ణాటక కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (కేసెట్) ఫలితాలను శనివారం ప్రకటించింది. ఇంజనీరింగ్, బీవీఎస్సీ, పశుసంరక్షణ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ బిజినెస్ మేనేజిమెంట్, సిరికల్చర్, బీ-ఫార్మా, ఫారెస్ట్రీ, బయో టెక్నాలజీ, బ్యాచిలర్ ఆఫ్ యోగాలో చేరేందుకు పరీక్షలు నిర్వహించారు. 2.6 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 1.21 లక్షల మంది బాలురు, 1.40 లక్షల మంది బాలికలు ఉన్నారు. 592 కేంద్రాలకు గాను బెంగళూరులోనే 121 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. 16వేల మంది కన్నడేతర విద్యార్థులు పరీక్షలు రాశారు. ఏప్రిల్ 18, 19 తేదీలలో పరీక్షలు జరిగాయి.

టీబీ డ్యాంకు మొదలైన వరద

రాయదుర్గం, జూన్ 1: రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయానికి వరద మొదలైంది. ఈ సీజన్‌లో తొలిసారి జలాశయంలోకి శనివారం 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గత ఏడాది ఈ సమయానికి వెయ్యి క్యూసెక్కులకు పైగా వరద ఉన్నింది. కానీ ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో వరద చేరలేదు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావంతో జలాశయం ఎగువ ప్రాంతాలైన ఆగుంబి, శృంగేరి, తీర్థహళ్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా వరదనీరు జలాశయంలోకి చేరడం మొదలైంది. ప్రస్తుతం జలాశయంలో డెడ్ స్టోరేజీ ఉంది. 1577.40 అడుగుల వద్ద 3.38 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 4.78 టీఎంసీల నీటి నిల్వలు ఉండేవి. సాధారణంగా ఈ సమయానికి జలాశయంలో ఏడు టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉండాలి. వరద మొదలు కావడంతో బోర్డు అధికారులు జలాశయంపై నిఘా పెంచి, పర్యవేక్షిస్తున్నారు.





కార్యాలయంలో మద్యం సేవిస్తున్న అధికారులు

కార్యాలయంలోనే మందుపార్టీ

- విద్యుత్‌శాఖ అధికారుల బరితెగింపు

దొమ్మసంద్ర, జూన్ 1: కర్ణాటక విద్యుత్ సరఫరా మండలికి చెందిన విద్యుత్‌శాఖ అధికారులు కార్యాలయంలోనే మందుపార్టీ చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆనేకల్ తాలూకా కెహెచ్‌బీ లే అవుట్ చందాపురలోని కార్యాలయంలో మద్యం తాగుతున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. బెస్కాం అధికారులైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, జేఈ రవికుమార్, మంజునాథ్‌నాయక్, లైన్‌మ్యాన్ రవి కలసి మద్యం తాగుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. బాధ్యతాయుతైన హోదాలో ఉంటూ కార్యాలయంలోనే ఇలా మందు పార్టీలు చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సిట్ అదుపులో భవాని కారు డ్రైవర్

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి హెచ్‌డీ రేవణ్ణ భార్య భవానిరేవణ్ణ కారు డ్రైవర్‌ను సిట్ అధికారులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. చిక్కమగళూరులోని కల్యాణనగర్‌లో డ్రైవర్ అజిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు రోజుల కిందట అజిత్ చిక్కమగళూరుకు వచ్చి ఇక్కడే గడుపుతుండగా సిట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణలు ప్రారంభించారు.





బెంగళూరులో వేర్వేరు చోట్ల కురుస్తున్న వర్షం

నగరంలో హోరెత్తించిన వాన


బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన రోజే రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు హోరెత్తాయి. బెంగళూరు నగర వ్యాప్తంగా శనివారం సాయంత్రం వరుణుడు కుదిపేశాడు. ఎలక్ట్రానిక్‌సిటీ, జేపీ నగర్, జయనగర్ హెబ్బాళ్, మైసూరు రోడ్డు, చామరాజపేట, లాల్‌బాగ్ విధానసౌధతోపాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసింది. వారాంతంలో ఒక్కసారిగా వర్షం హోరెత్తడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నగరంలో కొన్ని చోట్ల వర్షం కొమ్మలు విరిగిపడ్డంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. దక్షిణభాగంలోని హాసన్, కొడగు, మైసూరు, మండ్య జిల్లాల్లో 24 గంటల్లో భారీ వర్షం కురవనుందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. నగర ప్రజలు వర్షంలో తడిసిముద్దయ్యారు.



ఆశ్రమ సర్కిల్‌లో వేచి ఉన్న మహిళలు



సుల్తాన్‌పాళ్యలో కూలిన చెట్టుకొమ్మ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.44	1,579.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	00	696
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	00	213
సామర్థ్యం (టీఎంసీలు)	3.35	4.24

శ్రీరామదూతం శిరసానమామి!



సర్వాలంకృతుడైన అంజనాద్రి బెట్ట ఆంజనేయస్వామి

బళ్లారి గాంధీనగర్, రూరల్, కంప్లి, జూన్ 1 :హనుమజ్జయంతి సందర్భంగా కొప్పళ జిల్లా, గంగావతి సమీపంలో అంజనాద్రి బెట్టపై వెలసిన ఆంజనేయుడికిప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు తెల్లవారు జామునుంచే స్వామి దర్శనం కోసం బారులుతీరారు. అలాగే విదేశీయులు వచ్చిన సందర్భంలో స్థానికులు వారితో ఫోటోలు దిగుతున్నారు.

అభయాంజనేయ స్వామికి విశేషపూజలు

స్వామి వారి జయంతి సందర్భంగా బళ్లారి వెంకటేశ్వర నగర్‌లోని అభయాంజనేయస్వామికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆలయకమిటీ అధ్యక్షులు ధనుంజయ, ఉపాధ్యక్షులు భీమేష్ తెలిపారు. రాత్రి ఎనిమిది గంటలకు పల్లకిసేవ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జైసత్యనారాయణ, శిశు గోల్డ్ షాపు, యజమాని తిరుమల, సురేష్, కార్పొరేటర్ కవిత వన్నప్ప, జంబు, మంజు, శ్రీరాములు,రఘు పాల్గొన్నారు.



అంజనాద్రిని తిలకిస్తున్న విదేశీ పర్యాటకులు



పవమాన హోమం నిర్వహిస్తున్న దృశ్యం



వెంకటేశ్వరనగర్‌లోని అభయాంజనేయ స్వామి

మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలి

● బీజేపీ ఆందోళన ● కార్యకర్తల అరెస్టు



బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

బళ్లారి సిటీ, జూన్ 1: వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అక్రమాస్తుల కేసులో మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హొసపేటలో నిరసన చేపట్టింది. హొసపేటలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద శనివారం నిరసన తెలిపిన కార్యకర్తలు మాట్లాడుతూ, మంత్రి నాగేంద్ర తక్షణమే రాజీనామా చేయాలని, ఈ కుంభకోణాన్ని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉద్యోగి డెత్‌నోట్‌లో మంత్రి పేరును పేర్కొన్నాడని, ఆ మేరకు మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యాన్ని ఖండిస్తూ బలవంతంగా రహదారిని దిగ్బంధించిన కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈసందర్భంగా కిచ్చిడి కొట్రేశ్, అడవిస్వామి, సచ్చిన్ కుమార్, జగదీశ్ కమటగి, ద్వారకేశ్, చన్నవీర బద్రికట్టి, శ్రీకాంత్ పూజారా తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

కాళమ్మవీధిని విస్తరించాలి: ఎమ్మెల్యే



వీధులను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ, జూన్ 1: నగరంలోని పలు రోడ్ల విస్తరణ పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని బెంగళూరు రోడ్డు, కాళమ్మవీధి, బ్రాహ్మణ వీధి, తేరువీధులలో ఆయన శనివారం పర్యటించారు. బ్రాహ్మణ వీధి పార్కింగ్ నుంచి ప్రభుత్వ బాలికల పాఠశాల వరకు, మోతి సర్కిల్ నుంచి కాళమ్మ వీధికి చెందిన వడ్డర బండ వరకు ఎన్నో ఏళ్ళుగా శిథిలావస్థకు చేరిన రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సర్వే నిర్వహించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్‌ను ఆదేశించారు. ఈ నాలుగు రోడ్ల విస్తరణకు సంబంధించి సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని వారంలోగా సర్వే పనులు పూర్తి చేసి ఆక్రమణల తొలగింపునకు గుర్తులు ఇవ్వాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఖాదియా మసీదు వీధి, అమాలీ బాగ్ కాల్వలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా కార్పొరేషన్ సభ్యుడు ప్రభంజన్‌కుమార్ కూడ ఆయన వెంట ఉన్నారు.

గంజాయి చాక్లెట్ విక్రయిస్తున్న బీహారీ అరెస్ట్

బళ్లారి సిటీ, జూన్ 1: గంజాయి కలిపి చాకెట్లను విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన ఓ వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. సిరుగుప్ప తాలూకాలోని అంకాళి మఠం ఆలయ సమీపంలోని రైస్‌మిల్లు ఎదురుగా గుడిసెలో చాక్లెట్ విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖకు సమాచారం అందింది. సమాచారం మేరకు కపాల్ పాశ్వాన్ అనే వ్యక్తి గుడిసెపై దాడిచేసి అతని వద్ద ఉన్న గంజాయి కలిపిన 261 (మొత్తం 1.350 కిలోలు) చాకెట్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.వీటి మొత్తం విలువ రూ.2.600 అంచనా.అరెస్టయిన కపాల్ పాశ్వాన్ బీహార్‌లోని దర్బాంగ్ తాలూకాలోని దేవకులి గ్రామానికి చెందినవాడు. అతడిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈదాడుల్లో ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆశారాణి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నిరోణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఎక్సైజ్ వీరన్న, సిబ్బంది ఉమేశ్, దేవరాజు,రాఘవేంద్ర, లక్ష్మణ, మహంతేశ్, హరీశ్ తదితరులున్నారు.



పోలీసుల అదుపులో గంజాయి చాక్లెట్ విక్రయిస్తున్న వ్యక్తి

కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష

● ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

బళ్లారి సిటీ, జూన్ 1: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే బళ్లారి రావుబహద్దూర్ మహాబలేశ్వరప్ప తాంత్రిక విద్యాలయంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని శనివారం ప్రశాంత్ కుమార్ మిశ్రా సందర్శించారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉదయం 8గంటలకు ప్రారంభం కానున్న దృష్ట్యా స్ట్రాంగ్‌రూమ్‌లు తెరవడం, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు సమాయత్తం కావడం, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించడంపై ఆయన సమీక్షించారు. కౌంటింగ్ గదుల్లో అవసరమైన బారికేడ్లు, టేబుళ్ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రం ప్రవేశద్వారం వద్ద భద్రతను ఆయన పరిశీలించారు.

ఓట్ల లెక్కింపు చాలా సజావుగా, సక్రమంగా జరగాలని, ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆరోజు అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చక్కగా ఉండాలన్నారు. పరిశుభ్రత నిర్వహణకు క్లీనింగ్ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. అధికారికంగా ఎంట్రీ పర్మిట్(పాస్) ఉన్నవారు మాత్రమే ప్రవేశించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈసందర్భంగా ఆయన వెట అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్‌సాబ్, వివిధ అధికారులు, పోలీసు శాఖ అధికారులు ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రపంచ పాల దినోత్సవంలో వెంకటేశ్ గౌడ్

బళ్లారి సిటీ,జూన్ 1: పాల ఉత్పత్తుల్లో లభించే పొటాషియం, ప్రొటీన్‌లు, విటమిన్-బి2 వంటి పోషకాలు మనిషి ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని రాయచూర్, బళ్లారి, కొప్పళ(రాబకో) జిల్లాల మిల్క్ యూనియన్ ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. నగరంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆవరణ పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ పాల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ పాల దినోత్సవాన్ని 2001లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆఫ్ వరల్డ్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ) పాల ప్రాముఖ్యతను గుర్తించిందన్నారు. పాడిపరిశ్రమకు సంబంధించి కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే ఈ పాల దినోత్సవ లక్ష్యమన్నారు. జీవితంలో పాలకు ఉన్న ప్రాధాన్యతతోపాటు పోషకాల గురించి ప్రజలకు తెలియజేస్తామన్నారు. రాబకో ఇన్‌చార్జి మేనేజర్ (డెయిరీ) మల్లికార్జున మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా నాణ్యమైన పాలను నిల్వచేసి బీఎంసీ కేంద్రాల అసోషియేషన్‌కు సరఫరా చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా రాబకో జిల్లా సహకార పాల సంఘం సహాయ సంచాలకులు లోహిత్‌కుమార్, మంజునాథ్ బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ సువర్ణ లత, నీరజ, పార్వతమ్మ, పూజ తదితరులున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నందిని గుడ్ లైఫ్ టెట్రా ప్యాకెట్ పాలను పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న మిల్క్ యూనియన్ ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశ్‌గౌడ్

మంత్రి నాగేంద్రకు మద్దతుగా కాంగ్రెస్ ర్యాలీ

బళ్లారి, జూన్1(ఆంధ్రజ్యోతి): వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిపోయిందని మంత్రి బి.నాగేంద్రపై బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బళ్లారి నేతలు మండిపడ్డారు. బీజేపీ ఆరోపణలకు నిరసనగా శనివారం బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, ఎస్టీ సముదాయ నాయకులు పెద్ద ఎత్తున మౌన ర్యాలీ నిర్వహించారు. దుర్గమ్మ మాత ఆలయంలో పూజలు చేసిన అనంతరం వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ నుండి మౌనంగా రాయల్ సర్కిల్ నుండి డీ.సీ కార్యాలయం వద్దకు చేరుకుని ఏడీసీ జుబేదార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీ నిగమమంగలిలో ఏమాత్రం అక్రమాలు జరగలేదని బీజేపీ నాయకులు కావాలనే దురుద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మేయర్ శ్వేత, ముండ్రిగి నాగరాజు, ఉపమేయర్ గాదిలింగప్ప, కట్టెమని నాగేంద్ర, కురుబ రామాంజినేయులు, గుమ్మనూరు జగన్, కార్పొరేటర్ ప్రభంజన్, విక్కీ, మానయ్య, అన్నా నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనాథ్, మాజీ మేయర్ రాజేశ్వరి, బోయపాటి విష్ణు, మించుశ్రీనివాస్, వన్నప్ప, ముల్లంగి నందీష్ బాబు, పేరం వివేక్, రియాజ్, ఆసీఫ్, నజ్మా, గోవిందు, బిఆర్‌ఎల్ శ్రీనివాసులు, ఉమాపతి, నూర్, కమీలా సూరీ, జబ్బర్, రాజశేఖర్ , ముదు మల్లియ్య, నాగభూషన్ గౌడు, సంగనకల్లు విజయ్‌కుమార్, ఎల్ మారెన్న, రవి, వెంకటేశ్ హేడ్డే, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మంత్రి నాగేంద్రకు మద్దతుగా బళ్లారిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు


నిజాయతీగా సేవ చేసేవారు ఉపాధ్యాయులే



అలీభగవాన్ దంపతులను సన్మానిస్తున్న తమ్మన్నగౌడ పాటిల్

సిరుగుప్ప, జూన్ 1 : ప్రామాణికంగా సేవ చేసే వృత్తి ఏదైనా వుందంటే అది ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని శిక్షణ సంయోజకులు తమ్మన్నగౌడ పాటిల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణంలో శనివారం ప్రభుత్వ పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు అలీ భగవాన్ రిటైరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో తమ్మనగౌడ మాట్లాడుతూ అలీభగవాన్ 28 యేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా సేవలు చేశారని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సమాజ సేవకులు అబ్దుల్ నబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐలు, ఏఎస్ఐలకు ఘన సన్మానం



రిటైరయిన ఎస్ఐ, ఏఎస్ఐలను సన్మానిస్తున్న ఎస్పీ రంజిత్ కుమార్

బళ్లారిరూరల్, జూన్ 1 : మే 31న ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు ఎస్ఐలు, ఏడుగురు ఏఎస్ఐలను బళ్లారి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ భండారి సన్మానించారు. గత 32 సంవత్సరాలుగా పోలీసు అధికారులుగా వారి కర్తవ్యాలను నిర్వహించి రిటైరయినవారిని, వారి కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలో విధులు నిర్వహించినవారు ఇకపై కుటుంబంతో సంతోషంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటై రయిన అధికారుల్లో ఆరోగ్య స్వామి, శివన్న, అస్లామ్, గురు, సిద్దన్నగౌడతో పాటు పలువురు కూడా సన్మానం అందుకున్నారు.

రైతులకు విత్తనాలు సిద్ధం

కంప్లి, జూన్ 1: కంప్లి వ్యవసాయ కేంద్రంలో రైతులకు కావల్సిన వరి, కంది, పత్తి, ప్రొద్దుతిరుగుడు, కొర్రలు తదితర విత్తనాలు సిద్దంగా వున్నాయంటూ వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ తెలిపారు. రైతులకు కావాల్సిన డ్రిప్ మోటార్లు, పిచికారి మందులు, రసాయనిక ఎరువులు కూడా అందుబాటులో ఉంచామన్నారు. రైతులు బయట దుకాణాలలో కొనుగోలు చేయకుండా ప్రభుత్వం అందించే విత్తనాలు, రసాయనిక ఎరువులు కొనుగోలు చేసి పంటలు పండించుకోవాలని సూచించారు.



ఖరీఫ్ కోసం సిద్ధంగా వున్న విత్తనాలు

హంపి వద్ద చిరుత ప్రత్యక్షం



డ్రోన్ కెమెరాకు చిక్కిన చిరుత

కంప్లి, జూన్ 1 : గత రెండు మూడు రోజులుగా హంపి, బుక్కసాగర కొండల్లో చిరుత ప్రత్యక్షమైంది. రైతులు భయాందోళనకు గురై డ్రోన్ కెమెరాతో సర్వే చేయగా విజయవిఠల దేవస్థానం కొండల్లో నది ఒడ్డున ఒక బండరాయిపై కనిపించింది. అక్కడ స్థానికులు పొలాలకు వెళ్లాలన్నా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతలు సంచరించే ప్రదేశాల్లో బోనులు ఏర్పాటు చేసి వాటి నుండి విముక్తి చేయాలన్నారు. తరచుగా హంపి కొండ ప్రాంతాల్లో చిరుతలు ప్రత్యక్షమవుతుండటంతో పర్యాటకులు కూడా హంపిని సందర్శించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

హోసూరు జోన్

శ్రీసత్యసాయి జిల్లాలో కారు బోల్తా: ఒకరి మృతి



ప్రమాదానికి గురైన కారు. ఇన్‌సెట్‌లో గాయపడిన సెల్వరాజ్

హిందూపురం అర్బన్, జూన్ 1: శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం సమీపంలో కారు బోల్తాపడి తమిళనాడుకు చెందిన రాజశేఖర్(50) మృతిచెందారు. తమిళమణి, సెల్వరాజ్, రామకృష్ణన్ గాయపడ్డారు. తమిళనాడులోని ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన వీరు నలుగురూ ఎక్స్‌కవేటర్ అద్దె వసూలు చేసేందుకు శనివారం ఉదయం హోసూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు బయలుదేరారు. ధనాపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో రాజశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదియమాన్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో 381 మంది ఎంపిక

హోసూరు జూన్ 1: హోసూరు అధియమాన్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ ఇంటర్ యూనివర్సిటీ పరీక్షకు హాజరైన 381 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్ విక్టర్ సుందర్‌రాజ్ ఇంటర్వ్యూకు హాజరైన 381 మంది విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. ప్రొఫెసర్ శక్తివేల్ , నాగేశ్వరన్ ప్లేస్‌మెంట్ కమిటీ కరుప్పస్వామి, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి వార్షిక నివేదికను చదివి వినిపించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంఘనాథ్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

భారీ వర్షం.. వాహనదారుల అవస్థలు

హోసూరు జూన్ 1 : హోసూరులో శనివారం దాదాపు గంటపాటు భారీ వర్షం కురిసింది. భారీ వర్షాల కారణంగా హోసూరు బస్టాండు, బాగలూరు రోడ్డు సర్కిల్ , జీఆర్‌టీ.వృత్తం, తదితర కొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ క్రమంల్లో హోసూరు రైల్వేష్టేషన్‌కు సమీపంలో ఉన్న రైల్వే సొరంగం ముంపునకు గురైంది. దీంతో మోకాళ్లలోతు వర్షపు నీరు పేరుకుపోయింది. వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నడవడానికి ఇబ్బంది ఎదుర్కొన్నారు. కొన్ని ద్విచక్ర వాహనాలను పూర్తిగా నీటిలో తోసుకుంటూ వెళ్లవలసి వచ్చింది. చాలా సేపు వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి చాలా దూరం వెళ్లాయి. భారతీదాసన్ నగర్ ప్రాంతంలోని రైల్వే అండర్‌పాస్ ద్వారా వేలాది ద్విచక్ర వాహనాలు కిటకిటలాడుతూ వెళుతుంటాయి. వర్షపునీరు ప్రవహించడంతో ఆ రహదారిగుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం పడితే ఈ సొరంగం నీటితో నిండిపోతుంది. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రైల్వే అధికారులు వెంటనే దీనికి పరిష్కారం చే పట్టాలని ప్రజలు కోరుతున్నారు. హోసూరు సమీపంలోని జూజువాడీ ప్రాంతంల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సిప్‌కాట్ ప్రాంతంల్లో ఫ్లైఓవర్ పనులు జరుగుతుండగా శనివారం కురిసిన వర్షాలకు ట్రాఫిక్ జామ్ రెండు గంటల పాటు ఏర్పడింది. అత్తిపల్లి టోల్‌గేట్ రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వర్షపు నీటిలో నిలిచి పోయిన వాహనాలు

మంత్రిని పదవి నుంచి తొలగించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.శివరాజ్ పాటిల్ ● బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

రాయచూరు, జూన్ 1 : వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో నిధులను పక్కదారి పట్టించిన వ్యవహారంలో మంత్రి నాగేంద్రను క్యాబినెట్ నుంచి తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. మంత్రి తీరును నిరశిస్తూ బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా.శివరాజ్ పాటిల్, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను తెలంగాణ ప్రాంతానికి చెందిన కంపెనీలకు బదిలీ చేయడం తీవ్ర ఆక్షేపణీయమన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని, అవినీతి వ్యవహారంలో తనవంతు పాత్ర పోషించిన మంత్రి నాగేంద్రను వెంటనే పదవి నుంచి తప్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి అధికారుల బృందంతో జరుగుతున్న విచారణకు బదులు రిటైర్డ్ హైకోర్టు జడ్జీ చేత విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. అదే సమయంలో కార్పొరేషన్ నిధులు ఇతర రాష్ట్రాలకు మళ్ళిన నేపథ్యంలో వాటిని తిరిగి రప్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన బీజేపీ నేతలు

బిల్డింగ్‌పై నుంచి పడి సెక్యూరిటీ గార్డు మృతి

రాయచూరు, జూన్ 1 : సింధనూరు నగరంలోని అక్కమహాదేవి విశ్వవిద్యాలయ సెక్యూరిటీ గార్డు బసయ్య ధుమతి(45) బిల్డింగ్ పైనుంచి పడి మృత్యువాతపడ్డాడు. శుక్రవారం రాత్రి డ్యూటీకి వచ్చిన అతడు అర్ధరాత్రి వేళ మూత్రవిసర్జన కోసం కిందికొచ్చే ప్రయత్నంలో నిద్రమత్తులో పైకప్పునుంచి జారి కింద పడ్డాడు. పైకప్పుకు ప్రహరీ లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సింధనూరు నగర పోలీసులు కేసు నమోదు చేశారు.



బసయ్య(ఫైల్)

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

రాయచూరు, జూన్ 1 : రాయచూరు-హైదరాబాద్ ప్రధాన రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజుల క్రితం కురిసిన తేలికపాటి వర్షంతో ఈ మార్గంలోని ఆర్‌యూబీ కిందికి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రాకపోకలు సాగించే ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనికి తోడు ఆర్‌యూబీ వద్ద ఉన్న రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు శనివారం పనులను ముమ్మరం చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఇళయరాజా (పుట్టినరోజు)



మేస్ట్రోగా పేరొందిన 'పద్మ విభూషణ్' గ్రహీత ఇళయరాజా 1943 జూన్ 3న తమిళనాడు రాష్ట్రం తేని జిల్లా పన్నైపురం ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు జ్ఞాన దేశికన్. తనకు 'ఇసై జ్ఞాని' (సంగీత విద్వాంసుడు) బిరుదు ఇచ్చిన కలైజ్ఞర కరుణానిధి గౌరవార్థం జూన్ 2న పుట్టినరోజు జరుపుకోవడానికి ఇళయరాజా ఇష్ట పడతారు. దేశంలోని ప్రముఖ సంగీతకారులలో ఒకరు. పాశ్చాత్య సంగీతాన్ని మిళితం చేస్తూ దక్షిణాది సినిమాలలో సరికొత్త ఒరవడిని సృష్టించారు. మేస్ట్రో తదితర బిరుదులు పొందారు. తమిళం ప్రధాన మైనప్పటికీ తెలుగు, మళయాళ, కన్నడ, హిందీ భాష లలో 1400కు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించారు. 7వేల పాటలకుపైగా స్వరకర్త. గేయ రచయిత, గాయకుడు, ఆర్కెస్ట్రేటర్‌గాను రాణించారు. ఐదు జాతీయ అవార్డు, సంగీత నాటక అకాడమీ, పద్మభూషణ్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2022 జూలైలో రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

నందన్ నీలేకణి (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత నందన్ నీలేకణి 1955 జూన్ 2న బెంగళూరులో జన్మించారు. ఇన్ఫోసిస్ సంస్థ సహ సంస్థాపకులలో ఒకరు. నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన హయాంలో ఇన్ఫోసిస్‌కు మరింత గుర్తింపు వచ్చింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐ డీఏఐ) ఛైర్మన్‌గా ఆధార్‌ను అభివృద్ధి చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో అడ్వైజరీ బోర్డులోను ఉన్నారు. ఐఐటీ బాంబే నుంచి 2019లో గౌరవ డాక్టరేట్ అందు కున్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యుడైనప్పటికీ క్రియాశీలకంగా లేరు.

మణిరత్నం (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత మణిరత్నం 1956 జూన్ 2న మదురైలో జన్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సినిమా దర్శకుడు, స్క్రీన్ రైటర్, నిర్మాత. ప్రధానంగా తమిళ సినీరంగంలో ఉన్నా వివిధ భాషలలో సినిమాలు తీశారు. 6 జాతీయ అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు అందు కున్నారు. 1986లో 'మౌనరాగం'తో గుర్తింపు పొందారు. ఆయన సినిమాలు కళాత్మకంగాను, కమ ర్షియల్‌గాను విజయవంతం అందు కున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఆయన సినిమాలు ప్రదర్శించబడ్డాయి.

స్టీవ్ వా (పుట్టినరోజు)




ఆస్ట్రేలియా దేశానికి చెందిన అంతర్జాతీయ క్రికెటర్ స్టీవ్ వా 1965 జూన్ 2న జన్మించారు. పూర్తి పేరు స్టీఫెన్ రోజర్ వా. మార్క్ వా, స్టీవ్ వాలు కవలలు. 1997 నుంచి 2004 వరకు ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కొనసాగారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్‌మన్‌గా రాణించారు. 1999లో వరల్డ్‌కప్ సాధనలో ఆయన సాధన ఎంతో ఉంది. 41 విజయాలతో మోస్ట్ సక్సెస్‌ఫుల్ టెస్ట్ కెప్టెన్‌గా నిలిచారు. టెస్టులలో 10వేల మైలురాయి సాధించిన ప్రపంచంలోని 12 మంది క్రీడాకారులలో ఒకరు. 2004లో ఆస్ట్రేలియన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, ఆస్ట్రేలియన్ స్పోర్ట్స్ మెడల్ పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక సామాజిక సేవా కార్య క్రమాలకు చేయూత అందిస్తున్నారు.

లలితా బాబర్ (పుట్టినరోజు)



లలితా బాబర్ 1989 జూన్ 2న మహారాష్ట్రలోని సతారా జిల్లా మోహి ప్రాంతంలో జన్మించారు. లాంగ్‌డిస్టన్స్ రన్నర్‌గా రాణించి 'అర్జున' పురస్కారంతో జాతీయ గుర్తింపు పొందారు. 2005లో అండర్-20 విభాగంలో పూనెలో నిర్వహించి జాతీయ చాంపియన్ పోటీ లలో ఆమె బంగారుపతకం సాధించారు. 3వేల మీట ర్లలో సత్తా చాటుకోవడంతో పాటు 2014లో ముంబై మారథాన్‌లో హ్యాట్రిక్ విన్నర్‌గా నిలిచారు. కొరియాలో 2014 ఏషియన్‌గేమ్స్‌లో కాంస్య పతకం, బీజింగ్‌లో 2015లో బంగారుపతకం అందుకున్నారు. 2020లో స్పోర్ట్స్‌కోటాలో రాయ్‌ఘడ్ జిల్లా మనగావ్‌లో తహ సీల్దార్‌గా నియమితులయ్యారు. ఇతర పురస్కారాలు పొందారు.

రాజ్‌కపూర్ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత రాజ్ కపూర్ 1942 డిసెంబరు 14న పెషావర్‌లో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు. అసలు పేరు సృష్టినాథ్ కపూర్. హిందీ సినిమా రంగంలో నటుడు, నిర్మాత, దర్శకుడు. ఆయన రూపొందించిన సినిమాలు దేశం లోనే కాక ఆసియా, యూరప్ వ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. 'చార్లీచాప్లిన్ ఆఫ్ ఇండియన్ సినిమా' గా పేరొందారు. 5 జాతీయ, 11 ఫిల్మ్‌ఫేర్, దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు అందుకున్నారు. 1988 జూన్ 2న కన్నుమూశారు.

డిటొనేటర్ నమిలి గేదెకు గాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 1 : రొద్దం మండలంలోని చిన్నచెరువుకట్ట కింద మేతకోసం వెళ్లిన ఓ గేదె డిటొనేటర్ నమిలింది. దీంతో గేదె దవడ పేలిపోయి తీవ్రంగా గాయపడింది. మండలకేంద్రమైన రొద్దం గ్రామానికి చెందిన పాడి రైతు రామాంజినేయులు శనివారం ఉదయం మేతకోసం నాలుగు గేదెలను తీసు కెళ్లాడు. అయితే అడవి పందులకోసం పెట్టిన పేలుడు పదార్థం తిని గేదె దవడ పేలిపోయింది. దీంతో పశు వైద్యుడిని పిలిపించి చికిత్సలు చేయించారు. అయితే ఆ గేదెను కబేళా తరలించాలని వైద్యుడు సూచించడంతో దానిని అమ్మేశాడు. ఈ సంఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పాడిరైతు రామాంజినేయులు వాపోయాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రామాంజనేయులు వాపోయాడు.

పరిషత్‌కు యతీంద్ర, సుమలత పేర్లు ఖరారు..?

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలను ఎన్నుకునే ప్రక్రియకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆశావహులసంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇరు పార్టీల రాష్ట్రనేతలు అధిష్ఠానంకు జాబితాలు పంపి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ నుంచి ఏడుగురిని ఎన్నుకునేందుకు వీలుండగా ఏకంగా 65 మందికిపైగా పోటీ చేస్తుండడంతో మల్లగుల్లాలు పడుతు న్నారు. మూడు రోజులపాటు ఢిల్లీలో మకాం వేసిన సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతోపాటు పలువురిని భేటీ అ య్యారు. రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండడంతో ఆమోదముద్ర పడలేదు. పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు సీఎం సిద్దరామయ్యకు వరుణ నియోజకవర్గాన్ని త్యాగం చేసిన కుమారుడు యతీంద్రకు, పరిషత్‌కు పంపేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్టు తెలుస్తోంది. ఇక బీజేపీలోనూ ఇదే పరిస్థితి కొన సాగుతోంది. మండ్య ఎంపీ టిక్కెట్ త్యాగం చేసినందుకు ఎంపీ సుమలతకు పరిషత్‌కు ఎంపిక చేయాలని అధిష్ఠానం సూచించినట్టు తెలుస్తోంది. బీజేపీ నుంచి ముగ్గురిని ఎన్నుకునేందుకు అవకాశం ఉంది. అయితే పేర్లను ప్రక టించే విషయంలో అధిష్ఠానం ఆచితూచి వ్యవ హరిస్తోంది. మండ్య ఇండిపెండెంట్ ఎంపీగా గెలుపొందిన సుమలత ఆ తర్వాత బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. ప్రస్తు త ఎన్నికల్లో ఆమె బీజేపీ నుంచి పోటీ చేయ దలిచారు. జేడీఎస్‌తో పొత్తు కుదరడంతో మండ్య టిక్కెట్ జేడీఎస్ కోటాకు చేరింది. బీజేపీ పెద్దలు సూచన మేరకు ఆమె పోటీకి వెనుకడుగు వేశారు. దీంతో బీజేపీ జాతీయ నేతలు సుమలతకు పరిషత్ హోదా కల్పించదలిచారు. ఒక్కో ఎమ్మెల్సీ విజయానికి 19మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది.



యతీంద్ర



సుమలత

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి



విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం ఇలా..

శిడ్లఘట్ట, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లను చేర్పించడం ద్వారా పాఠశాలలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ యువ నాయకుడు రవి బీ గౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మళమాచనహళ్ళి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రారంభోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ప్రవేశద్వారం వద్ద కొబ్బరిమట్టలు వేసి అలంకరించారు. విద్యార్థులకు గులాబీపూలు అందజేసి స్వాగతించారు. నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి, చాకొలేట్ ఇవ్వడం ద్వారా విద్యార్థులలో ఉత్సాహం నింపారు. అనంతరం సాంకేతికంగా విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి బీ గౌడ మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను వివరించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని పిల్లలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోకూడా ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పీడీఓ శైల, కార్యదర్శి రాజణ్ణ తదితరులు ప్రసంగించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మంజునాథ్ మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ ఉపాధ్యాయులు కొరత ఉందని సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలన్నారు. క్రీడా మైదానం కొరతను పరిష్కరించాలన్నారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మునేగౌడ, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు రామచంద్రాచారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడండి

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడేందుకు వీలుందని, యువ విద్యార్థులు రక్తదానంలో పాల్గొని సమాజంలో ఆదర్శప్రాయులు కావాలని కృష్ణ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు అభిప్రాయపడ్డారు. కృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. అకడమిక్ డైరెక్టర్ మనోహర్, పీజీ విభాగం డైరెక్టర్ వేణుగోపాల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాకుమారి పాల్గొన్నారు. స్వామి వివేకానంద బ్లడ్‌బ్యాంకు వలంటీర్ ఈశ్వర్, ఆర్ఎస్ఎస్ సంచాలకులు అవినాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా శారీరక, మానసిక సదృఢత సాధ్యమన్నారు. ప్రతి ఆరోగ్యవంతమైన మనిషి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో ప్రమాదాలు, అనారోగ్యంబారిన పడినవారికి సకాలంలో సమకూర్చే వీలుంటుందన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రాల ప్రదానం

కేసెట్ ఫలితాల్లో నారాయణ ర్యాంకుల పంట



హర్షను అభినందిస్తున్న డీన్ నాగరాజు



నితిన్ , సనా తబస్సుమ్, వజ్రకంత మిరాగి, అక్షత్‌మిశ్రా

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేసెట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు మరోసారి ర్యాంకులు పంట పండించారు. ఇంజనీరింగ్ విభాగంలో హర్ష కార్తికేయ ఊటుకూరి తొలిర్యాంకును కైవశం చేసుకున్నారు. ఇతను బి-ఫార్మా, డి-ఫార్మాలలోనూ రెండో ర్యాంకులో నిలిచారు. డి.ఎన్.నితిన్ బీవీఎస్‌సి, బీఎస్‌సీ నర్సింగ్‌లో రెండో ర్యాంకును, బీఫార్మా, డిఫార్మాలో మూడో ర్యాంకులో నిలిచారు. సనా తబస్సుమ్ ఇంజనీరింగ్‌లో నాల్గో ర్యాంకును, వజ్రకంత మిరాగి బీఎన్‌వైఎస్ విభాగంలో నాల్గోర్యాంకును, బీఎస్‌సీ నర్సింగ్‌లో ఏడో ర్యాంకును, బీ డీ ఫార్మాలలో తొమ్మిదో ర్యాంకును సాధించారు. అక్షత్ మిశ్రా బీవీఎస్‌సీ, బీఎస్‌సీ నర్సింగ్‌లో పదోర్యాంకును సాధించారు. ఉత్తమ విద్యార్థులను సహకారనగర్ కువెంపు భవన్ విభాగం డీన్ నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

బంగారపేట, జూన్ 1: జిల్లాకేంద్రమైన కోలారు పట్టణంలోని అంతరగంగె బుద్ధిమాంద్య పాఠశాలలో విద్యార్థులకు, వృద్ధులకు బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి, టైటాన్ కంపెనీ సహకారంతో 'నన్న కణ్ణు' పథకంలో భాగంగా కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఏటా ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లద్దాలను అందచేస్తున్నట్టు ఆసుపత్రికి చెందిన అవినాశ్ తెలిపారు. 10మందికి కళ్లద్దాలను అందచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అంతరగంగె బుద్ధిమాంద్య వికలచేతన పాఠశాల కార్యదర్శి కేఎస్ శంకర్, ప్రజ్ఞాశంకర్, సిబ్బంది వినయ్ తిరుమలేశ్, దివ్యాంగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి అద్దాలతో వృద్ధులు తదితరులు

పొగాకు వ్యసనానికి దూరంగా ఉండాలి

శిడ్లఘట్ట, జూన్ 1: పొగాకు ఉత్పత్తులు వాడరాదని పొగాకు వ్యసనానికి దూరం కావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని ఆరోగ్య అధికారి వెంకటేశ్‌మూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం, ఆరోగ్యశాఖ, కార్మికశాఖ సహకారంతో వరల్డ్ నో టొబాకో డేను అర్థవంతంగా ఆచరించారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి మాట్లాడుతూ ధూమపాన, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులను న్యాయాధికారి పూజా పరామర్శించారు. స్వచ్ఛతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డాక్టర్ మనోహర్, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు మునిస్వామిగౌడ, కార్యదర్శి భాస్కర్, సాంఘిక సంక్షేమ అధికారి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అధికారులు తదితరులు

మొబైల్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం



మొబైల్‌హాస్పిటల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న చక్రవర్తి



మొబైల్ ఆస్పత్రి వాహనం ఇదే..

పుట్టపర్తి, జూన్ 1: కర్ణాటక రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో డెంటల్ వైద్యసేవల కోసం శ్రీసత్యసాయి మొబైల్ హాస్పిటల్ పేరిట అంబులెన్స్‌ను ప్రారంభించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ సభామండపంలో శనివారం రాత్రి మొబైల్‌హాస్పిటల్‌ను సత్యసాయి గ్లోబల్‌ట్రస్టు చైర్మన్ చక్రవర్తి, సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. ఉత్తర కర్ణాటక జిల్లాల్లోని గ్రామీణప్రాంతాల్లో మెరుగైన డెంటల్ వైద్యసేవల కోసం ఈ మొబైల్ హాస్పిటల్‌ను వినియోగిస్తారు. ఈ అంబులెన్స్‌లో ఎక్స్‌రేతో పాటు ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి.

వ్యవసాయ మంత్రిని కలిసిన పావగడ ఎమ్మెల్యే



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 1 : కర్ణాటక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చలవరాయస్వామిని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ శనివారం ఆయన గెస్ట్‌హౌస్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంతో పాటు పావగడ రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సబ్సిడీ తో అందించాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సంవత్సరం పంపిణీ చేస్తున్న వేరుశనగ నాణ్యతలేదని, సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు నాణ్యమైన వేరుశనగ అందించాలని కోరానన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా అందించాలని, అన్నివిధాలా ఆదుకోవాలని కోరానన్నారు.

జపానందస్వామికి రైతుల సన్మానం



స్వామిజీని సత్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జూన్ 1 : స్థానిక రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామిని శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో తాలూకాలోని రైతులు శనివారం ఘనంగా సన్మానించారు. గడిచిన మార్చ్ నెల నుంచి స్వామి పావగడ ప్రాంతానికి చెందిన రైతుల ఎన్నో వేల పశువులకు గడ్డి పంపిణీ చేసి, రక్షించారని సీనియర్ రైతు కెంచగానపల్లి గోవిందప్ప అన్నా. అలాగే స్వామి చళకెర, మొలకలమూరు, గుడిబండ తదితర ప్రాంతాలకు చెందిన ఎన్నో పశువులకు మేత అందంచారన్నారు. ఈ నేపథ్యంలో రైతులు స్వామిజీకి పాదపూజ చేసి సత్కరించారు. స్వామిజీ సేవలు ప్రజలకు మరింత ఉపయోగపడాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో లాయర్ భగవంతప్ప, తర్కారి కిష్టప్ప, గంగాధర్‌నాయుడు అనేక మంది రైతులు పాల్గొని స్వామిజిని సన్మానించారు.

బెంగళూరు వీవీ ప్రొఫెసర్ మైలారప్పపై సస్పెన్షన్ వేటు



ప్రొఫెసర్ మైలారప్ప

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు యూనివర్సిటీ సోషియాలజీ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ మైలారప్పను సేవలనుంచి సస్పెండ్ చేస్తూ వైస్‌చాన్స్‌లర్ షేక్ లతీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో ఓ రియల్టర్‌ను బెదరించిన కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు రెండు నెలలక్రిందట అరెస్టు చేశారు. 48 గంటలకంటే ఎక్కువ జైల్లో ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగానే మైలారప్పను సస్పెండ్ చేశారు.

స్టీల్‌కేస్ నుంచి రెండు సరికొత్త కుర్చీలు

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో గృహోపకరణాలు, ఫర్నీచర్ రంగంలో అపార అనుభవం కల్గిన స్టీల్‌కేస్ సంస్థ వర్క్ బెటర్ కాన్ఫరెన్స్ పేరిట రెండు కొత్త కుర్చీలను లాంఛనంగా ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో కంపెనీ ఎండీ తీర్థాంకర బసు, మార్కెటింగ్ వైస్ ప్రెసెడింట్ సమంతాజ్యామ్‌లు ఆవిష్కరించారు. బెంగళూరులో కార్పొరేట్ కంపెనీలు అధికమని వారికి అవసరమైన ఫర్నీచర్‌ను అందుబాటులోకి తీసుకు రాదలిచామన్నారు. దేశంలో 25ఏళ్ల అనుభవం ఉందన్నారు. స్టీల్‌కేస్ కంపెనీ కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎగ్జిక్యూటివ్ హైబ్యాక్ ఛైయిర్, కర్మన్ పేర్లతో రెండు రకాల కుర్చీలను మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు.

కోళ్లఫారం యజమాని తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



మృతి చెందిన కోళ్లను ఇలా పడేశారు..

బంగారపేట, జూన్ 1: బూదికోటె హోబళి ఆలంబాడి జోతెనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని గాజగ గ్రామంలోని కోళ్లఫారంలో మృతి చెందిన కోళ్లను రోడ్డుపక్కన ఇష్టం వచ్చినట్టు పడేయడంపై గ్రామస్థులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఎండల వేడిమి కారణంగా ప్రతిరోజూ పెద్దసంఖ్యలో కోళ్లు మృతి చెందుతున్నాయి. ఫారం యజమాని సుబ్బారెడ్డి నేతృత్వంలో మృతి చెందిన కోళ్లను మురుగు కాలువలలో పడేశారు. దీంతో వీధికుక్కలు వీటిని తింటూ ఇష్టం వచ్చినట్టు రోడ్లపై తిరుగుతూ పాదచారులు, ఇతరులపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కొమ్మనహళ్ళి నుంచి పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే గాజగ గ్రామానికి నడుచుకుని వెళ్లే మార్గంలో చనిపోయిన కోళ్లను పడేయడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలపై వీధికుక్కలు దాడి చేస్తాయేమోనని భీతి చెందుతున్నారు. గాజగ గ్రామంలో సుబ్బారెడ్డికి మూడు కోళ్లఫారాలు ఉన్నాయి. చనిపోయిన కోళ్లను గ్రామ చెరువుతోపాటు పలు చోట్ల ఇష్టం వచ్చినట్టు పడేశారని గ్రామస్తులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. చెరువునీరు కలుషితం అవడమే కాక పలు సమస్యలు తలెత్తుతున్నాయని వెంటనే తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా సుబ్బారెడ్డికి చెందిన కోళ్ళఫారాలకు లైసెన్స్ ఉన్నా రెన్యూవల్ చేయలేదని ఈమేరకు నోటీసు ఇచ్చినట్టు పశుసంవర్ధకశాఖ అధికారి దృష్టికి తెచ్చినట్టు ఆలంబాడి జోతేనహళ్ళి పీడీఓ వసంత్ తెలిపారు.

నాలుగు గనుల సర్వే పూర్తి

రాయదుర్గం, జూన్ 1: అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న మైనింగ్ గనుల్లో నాలుగు గనుల సర్వే పూర్తి అయింది. శనివారం మూడవరోజు సర్వే ప్రక్రియను బృందం కొనసాగించింది. కర్ణాటకలో ఉన్న ఏడు మైనింగ్ గనుల్లో ఇప్పటికే నాలు గు పూర్తి అయినట్లు బృందం తెలిపింది. ముఖ్యంగా కర్ణాటకలోని టుముటి, విఠలాపురం గ్రామాలతో పాటు బేళూరు గ్రామంకు ఆనుకుని ఉన్న నాలుగు గనుల హద్దులను గుర్తించి సర్వే పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వే ప్రక్రియను సోమవారం నుంచి కొనసాగించనున్నారు. ప్రధానంగా మైనింగ్ లీజు కేటాయించేటపుడు రెవెన్యూ గ్రామ సరిహద్దులను ఆధారంగా చేసుకుని త్రవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అదే విధంగా మరో వైపు నుంచి కొందరు మైనింగ్ యజమానులు రెవెన్యూ సరిహద్దులు దాటుకుని 300 మీటర్ల మేరకు త్రవ్వకాలు చేసినట్లు గుర్తించారు. సుప్రీంకోర్టు నిర్ణయించిన అంతర్రాష్ట్ర సరిహద్దును ఆనుకుని ఉన్న మైనింగ్‌లలో ఆయా యజమానుల సమక్షంలో సర్వే జరిపి ఒప్పుకున్నట్లు సంతకాలు కూడా కేంద్రం బృందం తీసుకుంటుంది. దీంతో ఇప్పటి వరకు ఏడు గనులకు గాను నాలుగు గనుల హద్దులను నిగ్గుతేల్చి సర్వేను పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వేను సోమవారం నుంచి మొదలుపెట్టి ఆరవ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు బృందం తెలిపింది.